ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక: 195 ఆదివారం 22, మార్చి 2026 పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com

# ఆరు గ్యారెంటీల సంగతేంటి?

## ప్రమాణ స్వీకారం రోజే సంతకం చేశారు కదా

**ఇప్పటివరకు ఎందుకు పూర్తిగా అమలు చేయలేదు**
**ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలి**
**బడ్జెట్ సమావేశాల్లో బిల్లు పెట్టాలని కోరుతాం**
**హామీలు అమలు చేయకపోతే ప్రజలు బుద్ధి చెప్తారు**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు కోట్ల మంది ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన రోజునే ఆరు హామీల దస్త్రంపై సంతకం చేశారని గుర్తుచేస్తూ, ఇప్పటివరకు వాటిలో ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో అమలులోకి రాలేదని ఆరోపించారు.
శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు. “అభయహస్తం పేరుతో ప్రకటించిన ఆరు హామీలు ప్రజల్లో ఆశలు రేకెత్తించాయి. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం రోజునే ఆ హామీల దస్త్రంపై తొలి సంతకం చేశారు. అదే విషయాన్ని గవర్నర్ ప్రసంగంలో కూడా ప్రస్తావించారు. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలుపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది” అని అన్నారు.
ఆరు హామీల అమలులో ఆలస్యం కాకుండా పూర్తి స్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు. “ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం ..మిగతా 2లో

# మేం కట్టిన నిర్మాణాలకు శంకుస్థాపనలా?

## శ్రమ ఎవరిది? శిలాఫలకం ఎవరిది?

**సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి**
**గత ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు చేస్తూ రేవంత్ డ్రామాలు**
**కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే పామ్ సాగు సాధ్యమైంది**
**కాళేశ్వరాన్ని వ్యతిరేకించే రేవంత్ ఈ ఫ్యాక్టరీ ఎలా స్థాపిస్తారు?**
**నర్మెట్టలో 350 మంది రైతులకు రుణమాఫీ చేయలేదు**
**రేవంత్ రెడ్డి ఏ మొహం పెట్టుకొని ఇక్కడికి వస్తారు?**
**మాజీ మంత్రి హరీశ రావు ప్రశ్నలు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో రూ.300 కోట్లతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి ప్రణాళికలు వేసి, భూసేకరణ, నిర్మాణం ప్రారంభించామని, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం శంకుస్థాపన చేసి క్రెడిట్ తీసుకోవడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఇదే విధంగా జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రులు, సెంట్రల్ డ్రగ్ స్టోర్ వంటి ప్రాజెక్టులను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేసిందని స్పష్టం చేశారు. శనివారం నర్మెట్టలో రైతు మేళా సందర్భంగా మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు, సీఎం రేవంత్ రెడ్డి ఈ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం చేయనున్న నేపథ్యంలో బహిరంగ లేఖ రాసి తీవ్ర విమర్శలు చేశారు. ‘బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే జిల్లా జైలుకు భూసేకరణ చేశాం. జైలు నిర్మాణం పూర్తయి రెండేళ్లయింది. ఇప్పుడు వచ్చి మీరు ప్రారంభిస్తున్నారు. శ్రమ ఎవరిది.. శిలాఫలకం ఎవరిది?’’ అని ప్రశ్నించారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ..మిగతా 2లో



# నేడే రైతు భరోసా నిధులు

## ప్రతిపక్షాల విమర్శలకు చెక్ పెట్టనున్న రేవంత్ సర్కార్

**ఒక్క ఎకరానికి జమ చేయనున్న సర్కారు**
**సిద్దిపేట జిల్లా నమ్మెట్టలో ప్రారంభించనున్న సీఎం**
**యాసంగి పంటలకు అందనున్న పెట్టుబడి సాయం**
**మొత్తం 9 వేల కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం**
**ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న అన్నదాతలు**
**ప్రభుత్వ నిర్ణయంతో అన్నదాతల్లో హర్షం**
**రైతుల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ**
**త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు బూస్టప్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
అన్నదాతల ఆశాకిరణాలకు కొత్త వెలుగు నింపుతూ తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద నిధుల విడుదలకు సన్నాహాలు పూర్తి చేసింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సర్కారు ఈ నెల 22వ తేదీన సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో విశేష కార్యక్రమం ..మిగతా 2లో

# జీవన్ రెడ్డికి బుజ్జగింపులు



**ఆయన నివాసానికి వెళ్లిన శ్రీధర్ బాబు, అడ్లూరి**
**పార్టీలోనే కొనసాగాలని కోరినట్టు సమాచారం**
**జీవన్ రెడ్డి ఆవేదనను అధిష్ఠానానికి చేరవేస్తామంటూ హామీ**
**వెనక్కి తగ్గని సీనియర్ లీడర్ జీవన్ రెడ్డి**
**త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని పునరుద్ఘాటన**
**తనకు పార్టీలో తీరని అన్యాయం జరుగుతున్నదని ఆవేదన**
**హైకమాండ్ నుంచి పిలుపు వస్తుందా?**
**లేదంటే జీవన్ రెడ్డి పార్టీని వీడతారా?**
**నేడు మీడియా ముందుకు రానున్న సీనియర్ నేత**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
కాంగ్రెస్ పక్షాన్ని వదిలి వేరే పక్షానికి వెళ్తానని ప్రకటించిన సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డిని తిరిగి ఒప్పించి పక్షంలోనే నిలిపి ఉంచేందుకు ప్రభుత్వం తరపున మంత్రులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వ్యక్తిగతంగా కలిసి ..మిగతా 2లో

# సర్ పేరుతో హక్కులు కాలరాస్తున్నారు

**బీజేపీ ఉనికి పశ్చిమబెంగాల్‌కు ప్రమాదకరం**
**ఎందరో అర్హుల ఓటర్లను**
**జాబితా నుంచి తీసేశారు**
**తృణముల్ కాంగ్రెస్ పార్టీని**
**అణిచివేసే కుట్ర జరుగుతోంది**
**బీజేపీ దాడులను కచ్చితంగా ఎదుర్కొని తీరుతాం**
**పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ**
**రంజాన్ వేడుకల సందర్భంగా కోల్ కతాలో భారీ ర్యాలీ**




# దానం నాగేందర్ 'క్లీన్ చిట్'పై హైకోర్టులో సవాల్

దానం నాగేందర్ క్లీన్ చిట్‌పై కోర్టు మెట్లెక్కిన వివాదం
స్పీకర్ నిర్ణయంపై బీజేపీ ఎమ్మెల్యే పిటిషన్
ఫిరాయింపు ఆరోపణలపై మళ్లీ చర్చ
హైకోర్టు విచారణపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి న్యాయస్థానం మెట్లెక్కింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సంబంధించి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన క్లీన్ చిట్ రాజ్యాంగ విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.
గత సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున ఖైరతాబాద్ నుంచి గెలుపొందిన దానం నాగేందర్, ఆ తర్వాత అధికార కాంగ్రెస్ ..మిగతా 2లో

# పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ సీజ్

**అసైన్డ్ భూమిపై ఫామ్ హౌస్ నిర్మాణం..**
**బయటపడిన నిజాలు**
**రెవెన్యూ విచారణలో సంచలన అంశాలు**
**లగ్జరీ కార్లు సీజ్.. విచారణ వేగవంతం**
**ఫామ్ హౌస్ సీజ్‌కు సిద్ధమవుతున్న అధికారులు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్ హౌస్ వ్యవహారం ఇప్పుడు ..మిగతా 2లో





www.prajaswaramdaily.com WWW.PRAJASWARAMDAILY.COM

# జీవన్ రెడ్డికి బుజ్జగింపులు

**మొదటిపేజీ తరువాయి**



గంటకు మించి విస్తృత చర్చలు జరిపారు. ఈ భేటీలో జీవన్‌రెడ్డి పక్షంలో తనకు తగిన గౌరవం దక్కడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం..

గంటకు పైగా జరిగిన ఈ సమావేశంలో జీవన్‌రెడ్డి తన అసంతృప్తిని మంత్రుల ముందు స్పష్టంగా తెలిపారట. నాలుగు దశాబ్దాలుగా పక్షానికి అంకితమై సేవ చేస్తున్న తనకు సరైన గుర్తింపు లభించడం లేదని, తగిన గౌరవం కూడా దక్కడం లేదని ఆయన ఆవేదన చెందినట్టు సమాచారం. ఈ సందర్భంగా పక్షం భవిష్యత్, ఇతర ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. మంత్రులు ఆయన సమస్యలను గమనించి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

**అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తాం**

భేటీ ముగిసిన వెంటనే మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. జీవన్‌రెడ్డి నాలుగు దశాబ్దాలుగా పక్షంలో కొనసాగుతున్న అనుభవజ్ఞుడైన నాయకుడని గుర్తు చేశారు. ఆయనతో అనేక ముఖ్యమైన విషయాలు చర్చించినట్లు వెల్లడించారు. జీవన్‌రెడ్డి వ్యక్తం చేసిన ఆవేదనను పక్ష అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ భేటీ సానుకూలంగా ముగిసినట్లు మంత్రి వ్యాఖ్యానించారు.

అదే సమయంలో జీవన్‌రెడ్డి కూడా మీడియాతో మాట్లాడుతూ.. తన అభిప్రాయం వ్యక్తం చేశారు. తన నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టంగా తెలిపారు. తనపై ఉన్న సమస్యలన్నింటినీ రేపు వివరంగా వెల్లడిస్తానని ప్రకటించారు. దీంతో జీవన్‌రెడ్డి పక్షం వదిలి వెళ్లే అవకాశాలు ఇంకా కొనసాగుతున్నట్లు సంకేతాలు అందుతున్నాయి. ఇటీవల కాలంలో జీవన్‌రెడ్డి పక్షంలో తనకు తగిన స్థానం, గుర్తింపు లభించడం లేదని పలు సందర్భాల్లో సంకేతాలు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన ప్రభుత్వం ఆయనను పక్షంలోనే ఉంచుకోవాలని ఉన్నత స్థాయి నాయకుల ద్వారా చర్చలు ప్రారంభించింది. నాలుగు దశాబ్దాల సేవా నేపథ్యం కారణంగా జీవన్‌రెడ్డి లాంటి సీనియర్ నాయకులను కోల్పోవడం పక్షానికి పెద్ద నష్టమని అంతర్గత వర్గాలు భావిస్తున్నాయి. ఈ భేటీ ఫలితంగా జీవన్‌రెడ్డి తన నిర్ణయం మార్చుకుంటారా లేదా రేపు పూర్తి వివరాలు వెల్లడి చేసి పక్షం వదిలి వెళ్తారా అనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చగా మారింది.

ఈ పరిణామాలు కాంగ్రెస్ పక్షంలో అంతర్గత అసంతృప్తి ఉన్నట్లు మరోసారి బయటపడ్డాయి. ప్రభుత్వం జీవన్‌రెడ్డి ఆవేదనను తీవ్రంగా పరిగణించి తగిన పరిష్కారం చూపించాలని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. రేపు జీవన్‌రెడ్డి వెల్లడించే వివరాలు పక్ష రాజకీయాలపై ప్రభావం చూపించే అవకాశం ఉంది.

# దానం నాగేందర్ 'క్లీన్ చిట్'పై హైకోర్టులో సవాల్

**మొదటిపేజీ తరువాయి**



పార్టీలో చేరారు. కాంగ్రెస్ కండువా కప్పుకోవడమే కాకుండా, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీ ఎన్నికల్లో కూడా పోటీ చేశారు. బీఆర్ఎస్ బీఫామ్ ద్వారా గెలిచి మరో పార్టీలోకి వెళ్లినందున ఆయనపై అనర్హత వేటు వేయాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు.

ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ జరిపిన స్పీకర్, దానం నాగేందర్ అసలు పార్టీ మారలేదని, ఆయనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని క్లీన్ చిట్ ఇచ్చారు. అయితే, బహిరంగంగానే పార్టీ మారిన వ్యక్తికి స్పీకర్ ఇలాంటి తీర్పు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లో అసెంబ్లీ స్పీకర్‌ను , దానం నాగేందర్‌ను ప్రతివాదులుగా చేర్చారు.

ఈ కీలక పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (చీఫ్ జస్టిస్) ధర్మాసనం ఎల్లుండి విచారణ జరపనుంది. స్పీకర్ నిర్ణయంపై కోర్టు ఏ రకమైన స్పందన తెలియజేస్తుందోనని రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ విచారణలో పిటిషనర్ తరపున, స్పీకర్ తరపున , దానం నాగేందర్ తరపు న్యాయవాదులు తమ వాదనలను వినిపించనున్నారు.

# రంజాన్ పండుగ వేళ "అలై బలై" కార్యక్రమం



- **కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్న సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ**

**కామారెడ్డి, మార్చి 21(డిడి9 వార్త):**

పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని కామారెడ్డి జిల్లాలోని సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం "అలై బలై" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఎ. సలీం కేక్ కట్ చేసి అక్కడికి వచ్చిన సభ్యులకు స్వీట్లు తినిపిస్తూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం సభ్యులు ఒకరినొకరు అభినందించుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఎ. సలీం మాట్లాడుతూ పండుగలు మనుషుల మధ్య సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందించే గొప్ప సందర్భంగా నిలుస్తాయని తెలిపారు. సమాజంలో పరస్పర గౌరవం, స్నేహభావం పెరగడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, హిందూ-ముస్లిం అనే భేదం లేకుండా ప్రతి పండుగను పరస్పరం కలిసి జరుపుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఎ. సలీం, జిల్లాసలహాదారులు డాక్టర్ హరీష్‌గౌడ్, జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ ఏ.ఎం.బి భాస్కర్, జిల్లాపట్టణ ఉపాధ్యక్షులు సల్ల కృష్ణ, జిల్లా సంయుక్తకార్యదర్శి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆరు గ్యారెంటీల సంగతేంటి?

**మొదటిపేజీ తరువాయి**



ఏ ప్రభుత్వానికైనా ప్రధాన బాధ్యత. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించింది. హామీల దస్త్రం ఇప్పుడు కనిపించకుండా పోయింది. ఇది ప్రజలను మోసం చేసినట్లే" అని విమర్శించారు. ఈ హామీలకు చట్టబద్ధత కల్పించాలనే ఉద్దేశంతో శాసనసభలో ప్రత్యేక సభ్యుల బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. "వచ్చే శుక్రవారం శాసనసభలో ఈ బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించాం. దీనికి అనుమతి ఇవ్వాలని సభాపతిని కోరుతున్నాం. ఈ హామీలు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినవే కాబట్టి, ఆ పార్టీ కూడా ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాల్సిందే. ప్రజల ముందు ఇచ్చిన మాటను చట్టబద్ధంగా అమలు చేయించడమే మా లక్ష్యం" అని ఆయన తెలిపారు.

ప్రభుత్వం ప్రకటించిన ప్రతి హామీ అమలుపై కేటీఆర్ వివరంగా మాట్లాడారు. "మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు అది అమలులోకి రాలేదు. పింఛను మొత్తాన్ని రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు పెంచుతామని చెప్పారు. ఆ హామీ కూడా అమలులోకి రాలేదు. విద్యార్థులకు విద్యాభరోసా కార్డులు అందిస్తామని ప్రకటించారు. అది కూడా ఇప్పటికీ అమలు కాలేదు. కౌలు రైతులకు రూ.15 వేల ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. ఆ హామీ కూడా కాగితాలకే పరిమితమైంది" అని అన్నారు.

రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు వంటి వర్గాలందరూ ఈ హామీలపై ఆశలు పెట్టుకున్నారని, కానీ ప్రభుత్వం ఆ ఆశలను నెరవేర్చలేకపోయిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ హామీలు అమలైతే ప్రజలకు ప్రత్యక్ష లాభం చేకూరేది. కానీ ఇప్పటి వరకు ఏ ఒక్క వర్గానికీ పూర్తి స్థాయిలో ప్రయోజనం అందలేదు. ప్రజలు ఎదురుచూస్తూనే ఉన్నారు" అని పేర్కొన్నారు.

తాము ప్రవేశపెట్టే ప్రత్యేక సభ్యుల బిల్లు ఆమోదం పొందితే, ఈ హామీలన్నీ చట్టబద్ధంగా అమలులోకి రావాల్సి ఉంటుందని కేటీఆర్ తెలిపారు. "బిల్లు ఆమోదం పొందిన తర్వాత ప్రభుత్వం తప్పనిసరిగా ఈ హామీలను అమలు చేయాల్సిందే. ఇది ప్రజల హక్కుగా మారుతుంది. హామీల అమలుపై స్పష్టత వస్తుంది" అని అన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోతే ప్రజలు తగిన సమయంలో తీర్పు ఇస్తారని కేటీఆర్ హెచ్చరించారు. "ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావడం సులభం కావచ్చు. కానీ ఆ మోసం ఎక్కువ కాలం కొనసాగదు. ప్రజలు అన్నింటిని గమనిస్తున్నారు. సమయం వచ్చినప్పుడు తగిన విధంగా స్పందిస్తారు" అని వ్యాఖ్యానించారు.

ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలుపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే వెంటనే చర్యలు తీసుకోవాలని కేటీఆర్ సూచించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తాము ఈ అంశాన్ని శాసనసభలో బలంగా ప్రస్తావిస్తామని, అవసరమైతే ప్రజా ఉద్యమాలకు కూడా సిద్ధమని తెలిపారు. మొత్తానికి, ఆరు హామీల అమలుపై రాష్ట్రంలో రాజకీయంగా వేడెక్కుతున్న పరిస్థితుల్లో, బీఆర్ఎస్ తీసుకున్న ఈ నిర్ణయం శాసనసభలో చర్చనీయాంశంగా మారే అవకాశముందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి

# నేడే రైతు భరోసా నిధులు

**మొదటిపేజీ తరువాయి**



నిర్వహించి తొలి విడత నిధులను స్వయంగా విడుదల చేయనుంది. యాసంగి సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులకు ఈ నిధులు ఉగాది పండుగ సందర్భంగా ఆర్థిక బలం అందించేలా రూపొందించబడ్డాయి. చాలా కాలంగా ఎదురుచూస్తున్న రైతు కుటుంబాలకు ఇది గొప్ప ఊరటనిస్తోంది.

**పథకం లక్ష్యాలు, విస్తృతి**

రైతు భరోసా పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతుల పెట్టుబడి అవసరాలను తీర్చాలని నిర్ణయించింది. ఈ సీజన్‌కు ఎకరానికి రూ.6,000 చొప్పున సాయం అందించేందుకు మొత్తం రూ.9,000 కోట్లు కేటాయించింది. ఈ మొత్తాన్ని మూడు విడతలుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనుంది. తొలి విడతలో ఒక ఎకరం లోపు భూమి ఉన్న రైతులకు ప్రాధాన్యత ఇచ్చి సుమారు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,590 కోట్లు జమ చేయనుంది. రెండో విడత 20 రోజుల తర్వాత, మూడో విడత ఏప్రిల్ నెలాఖరున విడుదల చేసే ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 1.50 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన నిధులు ఇలా అందుతాయి. ఏటా రెండు సీజన్లకు కలిపి ఎకరానికి రూ.12,000 వరకు సాయం అందించాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది.

**రైతుల దీర్ఘకాలిక ఆశలు, ప్రభుత్వ కట్టుబాటు**

గత కొన్ని నెలలుగా రైతు భరోసా నిధుల కోసం అన్నదాతలు తీవ్రంగా ఎదురుచూశారు. పంట సీజన్ ప్రారంభంలోనే ఆర్థిక సహాయం అందాలనే ఆకాంక్షతో రైతాంగం ఆశపడింది. ఈ నేపథ్యంలో ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి, వ్యవసాయ రంగ అభివృద్ధికి పూర్తి కట్టుబాటు చూపించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సమీక్షలు నిర్వహించి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుతో చర్చించి ఈ నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా డబుల్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ విధానం ద్వారా నిధులు జమ చేయడం ద్వారా మధ్యవర్తుల జోక్యం తొలగించి పారదర్శకతను నిర్ధారించారు.

**నర్మెట్ట కార్యక్రమం, రైతు ఉత్సవాలు**

సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో జరిగే ఈ విశేష కార్యక్రమం రైతు ఉత్సవాల ముగింపుగా ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను కూడా ప్రారంభించనున్నారు. రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొనే ఈ కార్యక్రమం రైతాంగానికి కొత్త ఉత్సాహం నింపుతుంది. నర్మెట్టలో జరిగే ఈ ఘట్టం రాష్ట్ర వ్యవసాయ రంగానికి మైలురాయిగా మారనుంది. ఇక్కడి నుంచి మొదలయ్యే నిధుల విడుదల ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా వేగంగా కొనసాగుతుంది.

**చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం**

రైతు భరోసా పథకంలో చిన్న, సన్నకారు రైతులకు ప్రత్యేక ఆదరణ ఇస్తున్నారు. ఒక ఎకరం లోపు భూమి ఉన్న రైతులకు తొలి విడతలోనే పూర్తి సాయం అందించడం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు మేలు చేస్తున్నారు. రాష్ట్రంలోని ఎక్కువ భాగం రైతులు చిన్న భూముల్లోనే సాగు చేస్తున్న వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇది రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. విత్తనాలు, ఎరువులు, కార్మికుల వేతనాలు, యంత్రాల అద్దెలు వంటి పెట్టుబడి ఖర్చులను తీర్చడం ద్వారా రైతులు రుణాల బారిన పడకుండా స్వేచ్ఛగా సాగు కార్యకలాపాలు కొనసాగించగలరు.

**వ్యవసాయ రంగ అభివృద్ధికి కొత్త ఊపిరి**

రైతు భరోసా నిధుల విడుదల రాష్ట్ర వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి అందిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. యాసంగి సీజన్‌లో పత్తి, మొక్కజొన్న, చెరకు వంటి పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ సాయంతో ఉత్పాదకతను పెంచుకోవడం ఖాయం. ఇది మార్కెట్‌లో మంచి ధరలు సాధించడానికి దోహదపడుతుంది. అంతేకాకుండా, రైతుల ఆర్థిక స్థిరత్వం కల్పించడం ద్వారా గ్రామాల్లో వినియోగం పెరిగి స్థానిక ఆర్థిక వ్యవస్థకు లాభం చేకూరుతుంది. ప్రభుత్వం ఈ పథకంతో పాటు సాదా బైనామా సమస్యల పరిష్కారం, ఇతర సంక్షేమ కార్యక్రమాలను కూడా వేగవంతం చేస్తోంది.

**రైతు కుటుంబాల్లో ఆనందం**


రైతు భరోసా నిధులు జమ కాబోతున్న వార్తతో రాష్ట్రవ్యాప్తంగా రైతు కుటుంబాల్లో ఆనందం వ్యాపించింది. చాలా రోజులుగా ఈ సాయం కోసం ఎదురుచూసిన అన్నదాతలు ఇప్పుడు కొత్త ఉత్సాహంతో సాగు కార్యకలాపాల్లో మునిగిపోయే అవకాశం ఏర్పడింది. ప్రభుత్వం రైతుల సమస్యలను స్పందించి సకాలంలో చర్యలు తీసుకోవడం రైతాంగానికి గొప్ప నమ్మకం కలిగించింది. ఈ పథకం ద్వారా రైతుల ఆదాయం పెరిగి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని వ్యవసాయ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

**భవిష్యత్ దృక్పథం**

రైతు భరోసా పథకం అమలు ద్వారా తెలంగాణ వ్యవసాయ రంగం స్వయం సమృద్ధి వైపు అడుగులు వేస్తోంది. ప్రభుత్వం రైతులకు సమయానికి సాయం అందించడం ద్వారా పంటల ఉత్పాదకతను పెంచి, దేశీయ మార్కెట్‌లో తెలంగాణ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇస్తుంది. ఈ కార్యక్రమం రైతులను ఆర్థికంగా బలోపేతం చేసి, రాష్ట్రాన్ని వ్యవసాయ హబ్‌గా మార్చడంలో కీలకపాత్ర వహిస్తుంది. నర్మెట్టలో జరిగే ఈ ఉత్సవం రైతులకు గొప్ప సందేశం అందిస్తూ, రాష్ట్ర వ్యవసాయ రంగం భవిష్యత్తును మరింత ఉజ్వలం చేస్తుంది. ఈ నిధుల విడుదలతో తెలంగాణ రైతులు కొత్త ఆశలతో ముందుకు సాగేలా ప్రభుత్వం చేపట్టిన చర్యలు రైతాంగం హృదయాల్లో స్థానం సంపాదించాయి. అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినట్లుగా ఈ పథకం అమలు రైతుల జీవన విధానాలను మార్చేస్తుందని అంచనా వేస్తున్నారు.

# మేం కట్టిన నిర్మాణాలకు శంకుస్థాపనలా?

**మొదటిపేజీ తరువాయి**



నీటి వల్లే ఈ ప్రాంతంలో ఆయిల్ పామ్ సాగు సాధ్యమైందని, 2021లో కేసీఆర్ క్యాబినెట్ నిర్ణయంతో రూ.300 కోట్లు మంజూరు చేయడం ద్వారా ఫ్యాక్టరీ వచ్చిందని గుర్తు చేశారు.

'ఇప్పటికీ రుణమాఫీ పూర్తి కాలేదు. నర్మెట్టలోనే 350 మంది రైతులకు రుణమాఫీ అవ్వలేదు. జిల్లాలో 22 వేల మందికి రూ.300 కోట్లు పెండింగ్‌లో ఉంది. మూడు పంటలకు రైతుబంధు ఎగ్గొట్టారు. రైతుబంధు బకాయిలు వెంటనే ఇవ్వాలని రైతుల తరపున అడుగుతున్నా. పంటల బీమా ఇప్పటికీ చేయించలేదు. వర్షాలు, తుపానుల వల్ల నష్టపోయిన పంటలకు బీమా రాలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సిద్దిపేటకు ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా ఇవ్వలేదు'' అని ఆరోపించారు.

ఆయుష్ ఆస్పత్రులు, సెంట్రల్ డ్రగ్ స్టోర్, పీహెచ్‌సీలు వంటివి తన ఆరోగ్య శాఖ మంత్రి కాలంలోనే మంజూరు చేసి పూర్తి చేశామని హరీశ్‌రావు వివరించారు. ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభం చేయలేకపోయామని, ఇప్పుడు కాంగ్రెస్ వాటిని తమ సాధింపుగా చూపిస్తోందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేటకు వస్తున్నందుకు ''ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారు'' అని బహిరంగంగా ప్రశ్నించారు. నర్మెట్టలో జరిగిన రైతు మేళాలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య స్వల్ప ఉద్రిక్తత నెలకొన్న విషయం గమనార్హం. హరీశ్‌రావు వచ్చేసరికి ''హరీశ్‌రావు జిందాబాద్'' నినాదాలు, కాంగ్రెస్ వర్గం నుంచి వ్యతిరేక నినాదాలు వచ్చాయి. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లు మధ్యవర్తిత్వం వహించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం (20142023) హయాంలోనే ఈ ప్రాజెక్టులకు బీజం వేసిన వాస్తవం స్పష్టం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం (2023 నుంచి) నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చిందని చెబుతోంది. 2028 అసెంబ్లీ ఎన్నికల ముందు ఇలాంటి ఆరోపణలు బీఆర్ఎస్‌కు రాజకీయ లాభం ఇవ్వడానికి, కాంగ్రెస్‌కు తమ హామీల అమలును చాటడానికి ఉపయోగపడతాయి. స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు తన నియోజకవర్గాన్ని కాపాడుకోవడం కూడా ఇందులో భాగం. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ రైతులకు బంగారు అవకాశం. కాళేశ్వరం నీటి వల్ల తేమ శాతం పెరిగి సాగు సాధ్యమైంది. దేశంలో ఎడిబుల్ ఆయిల్ దిగుమతులు తగ్గించి, స్థానికంగా 2 వేల మందికి ఉపాధి, రైతులకు లాభదాయక పంట (వరి కంటే ఎక్కువ ఆదాయం) ఇస్తుంది. రిఫైనరీ కూడా వస్తుంది. ఇలాంటి ప్రాజెక్టులు ప్రభుత్వాలు మారినా కొనసాగడం సానుకూలం. బీఆర్ఎస్ ఆలోచన, కాంగ్రెస్ అమలు - రెండూ కలిస్తే రైతు మేలు.

కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా (పాత రైతుబంధు స్థానంలో) ప్రధానం. ప్రభుత్వం ఇప్పటికే రూ.21 వేల కోట్లకు పైగా రుణమాఫీ చేసినట్లు, రైతు సంక్షేమానికి రూ.1.09 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు చెబుతోంది. రైతు భరోసా మొదటి వాయిదా (రూ.3,590 కోట్లు) మార్చి 22న (ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంలోనే) జమ చేయనుంది. అయినా నర్మెట్టలో 350 మంది, జిల్లాలో వేలాది మందికి మాఫీ పెండింగ్, పంట బీమా, వడగళ్ల నష్టపరిహారం ఇంకా రాకపోవడం వాస్తవం. బీఆర్ఎస్ కాలంలో కూడా రైతుబంధు ఆలస్యాలు ఉండేవి. రైతులు ఇప్పటికీ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని హరీశ్‌రావు ఆరోపణ సరైనదే, కానీ ప్రభుత్వం కొంత మేరకు అమలు చేస్తోందని కాంగ్రెస్ వాదన.

సిద్దిపేట హరీశ్‌రావు స్వగ్రామం సమీపంలోని ప్రాంతం. ఇక్కడ రైతులు ప్రధానంగా వరి, ఇతర పంటలపై ఆధారపడతారు. ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయాలు వారి ఆదాయం పెంచుతాయి. కానీ రుణాలు, బీమా ఆలస్యాలు రైతులను నిరాశకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వాల మధ్య ఘర్షణలు స్థానికంగా ఉద్రిక్తత సృష్టిస్తున్నాయి. ఈ సంఘటన రాజకీయాల్లో 'ప్రాజెక్టులు ఎవరివి' అన్న చర్చను మళ్లీ హైలైట్ చేసింది. అభివృద్ధి కొనసాగింపు మంచిదే, కానీ రైతుల హామీలు పూర్తి అమలు కావాలి. రేవంత్‌రెడ్డి ప్రారంభోత్సవంతో ఫ్యాక్టరీ ప్రయోజనాలు రైతులకు చేరువైతే అది సానుకూలం. హరీశ్‌రావు విమర్శలు ప్రభుత్వానికి 'చెక్'గా పని చేస్తాయి. రైతులకు న్యాయం జరిగితేనే రాజకీయాలు సార్థకం.

# పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ సీజ్

**మొదటిపేజీ తరువాయి**

పెను దుమారం రేపుతోంది. అజీజ్ నగర్‌లోని సర్వే నెంబర్ 177/33 పరిధిలో ఉన్న సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫామ్ హౌస్ పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో కట్టినట్లు రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో నిర్ధారణ అయ్యింది. 2006లో ఈ భూమి రోహిత్ రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు రికార్డులు చెబుతున్నప్పటికీ, భూభారతి రికార్డుల ప్రకారం అది జంగయ్య అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అసలు ప్రభుత్వానికి చెందిన అసైన్డ్ భూమిపై రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందనే అంశంపై ప్రస్తుతం రెవెన్యూ , పోలీస్ యంత్రాంగం లోతుగా ఆరా తీస్తోంది.

ఈ అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసిన రెవెన్యూ శాఖ, ఫామ్ హౌస్‌ను సీజ్ చేయాల్సిందిగా ఇప్పటికే అధికారులకు నివేదిక అందించింది. పోలీసుల విచారణలో భాగంగా ప్రస్తుతం ఈ ఫామ్ హౌస్ వారి కస్టడీలోనే ఉంది. అక్కడికి పార్టీ కోసం వచ్చిన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదు లగ్జరీ కార్లను (డిఫెండర్, వోల్వో, ఫోక్స్ వ్యాగన్, బెంజ్, రేంజ్ రోవర్) సీజ్ చేసి, ఆ సమాచారాన్ని కోర్టుకు నివేదించారు. పార్టీకి హాజరైన వారు తమ వాహనాలను అక్కడే వదిలేసి వెళ్లడంతో పోలీసులు వాటిని సీజ్ చేసి విచారణను వేగవంతం చేశారు. త్వరలోనే ఈ ఫామ్ హౌస్ సీజ్ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.

## సొంత నిధులతో వాటర్ సంపు నిర్మాణం చేయించిన కౌన్సిలర్

**మేడ్చల్ జిల్లా,(ప్రజాస్వరం):**
మేడ్చల్ జిల్లా ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి లోని 24 వ వార్డులో వార్డు కౌన్సిలర్ వాచపల్లి అర్చన శ్రీనివాస్ దుర్గమ్మ గుడి వద్ద సొంత నిధులతో వాటర్ సంపు నిర్మాణాన్ని చేయించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్గమ్మ గుడి వద్ద భక్తులు వాటర్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని దానిని గమనించి సంపు నిర్మాణం చేయించినట్లు తెలిపారు. వాటర్ సంపు నిర్మాణం చేయించిన సందర్భంగా కౌన్సిలర్ ని పలువురు అభినందించారు.



## మండల వ్యాప్తంగా మిన్నంటిన రంజాన్ సంబరాలు: భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు

**జగదేవ్ పూర్, మార్చి21, (ప్రజాస్వరం)**
మండల వ్యాప్తంగా రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) పండుగ వేడుకలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, సంబరంగా జరిగాయి. గొల్లపల్లి, మునిగడప, వడ్డిపల్లి, చాట్లాపల్లి, మరియు ఇటిక్యాల వంటి పలు గ్రామాల్లో ముస్లిం సోదరులు ఈద్గాలకు మరియు మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఆయా గ్రామాల్లోని ముస్లిం సోదరులు ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి, సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అలాగే వేడుకల్లో భాగంగా చిన్నలు, పెద్దలు అందరూ కలిసి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని (అలాయ్ బలాయ్) ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.గ్రామాల్లోని ఇతర కులమతాల వారు కూడా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపి, 'షీర్ కుర్మా' తింటూ పండుగ సంతోషాన్ని పంచుకున్నారు. ఇది గ్రామాల్లోని మత సామరస్యానికి అద్దం పట్టింది.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ గణేష్, గ్రామ శాఖ బిఆర్ఎస్ అధ్యక్షులు నాగరాజు, వార్డ్ సభ్యులు భాస్కర్,మసీదు కమిటీ అధ్యక్షులు ఎండి. ఆసిఫ్ అలీ హాజీ భాయ్, ఉపాధ్యక్షులు ఎండి. ఖాజా పాషా, కోశాధికారి ఎండి. రహీం భాయ్, వార్డు సభ్యులు ఎండి. ఇస్మాయిల్, ఎండి. అలీమ్ భాయ్, ఎండి. బషీర్ భాయ్ మరియు ఇతర ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



## ఇఫ్తార్ విందులో పాల్గొన్న నర్సారెడ్డి

**జగదేవ్ పూర్, మార్చి 21, (ప్రజాస్వరం)**
జగదేవ్‌పూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి అజీజ్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే మరియు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణకు, దైవ చింతనకు ప్రతీక అని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి పండుగలను జరుపుకోవడం భారతీయ సంస్కృతికి నిదర్శనమని ఆయన అన్నారు. ముస్లిం సోదరులందరికీ ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, నాయకులు,ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# సర్ పేరుతో హక్కులు కాలరాస్తున్నారు

- **బీజేపీ ఉనికి పశ్చిమబెంగాల్‌కు ప్రమాదకరం**
- **ఎందరో అర్హుల ఓటర్లను జాబితా నుంచి తీసేశారు**
- **తృణముల్ కాంగ్రెస్ పార్టీని అణిచివేసే కుట్ర జరుగుతోంది**
- **బీజేపీ దాడులను కచ్చితంగా ఎదుర్కొని తీరుతాం**
- **కొన్ని ప్రాంతాల్లో ఓటర్లను ప్రలోభానికి గురి చేస్తున్నారు**
- **టీఎంసీ ఓటు బ్యాంకును చీల్చేందుకు కుట్రలు పన్నుతున్నారు**
- **ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే ఎన్నికల్లో అధికారం మాదే**
- **పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ**
- **రంజాన్ వేడుకల సందర్భంగా కోల్ కతాలో భారీ ర్యాలీ**



**నేషనల్‌బ్యూరో, (ప్రజాస్వరం):**
పశ్చిమబెంగాల్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు ప్రదర్శించారు. రంజాన్ ఉత్సవాల సందర్భంగా సెంట్రల్ కోల్‌కతాలో జరిగిన ప్రజాసమావేశంలో మమతా తన రాజకీయ సంకల్పాన్ని పునరుద్ఘాటించారు. "ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)" విషయంలో తన పోరాటాన్ని కొనసాగిస్తానని, ప్రజల హక్కులను లాక్కోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ చేసే ప్రయత్నాలను అడ్డుకుంటానని స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా మమతా బీజేపీ ఉనికి రాష్ట్రంలో అరికట్టాల్సిన అవసరం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఆమె వ్యాఖ్యల ప్రకారం, "సర్" ప్రక్రియలో అనేకమంది పౌరుల పేర్లను జాబితా నుంచి తొలగించారని, ఈ విధానం ద్వారా ప్రజల ఓటరు హక్కులను లాక్కోవడం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కులం, వర్గం, సమాజ వ్యత్యాసం లేని ప్రతి బెంగాల్ పౌరుడికి తాను న్యాయం చేస్తానని మమతా పేర్కొన్నారు.
మమతా బెనర్జీ పేర్కొన్న ప్రధాన సమస్యలు ప్రధానంగా కేంద్రం ఆచరణలో ఉన్న "సర్" సవరణలతో సంబంధం కలిగి ఉన్నాయి. ఈ ప్రక్రియలో అనేక మంది పౌరుల పేర్లను తొలగించడం, ఓటరు జాబితాలో మార్పులు చేయడం ద్వారా భాజపా కొన్ని ప్రాంతాల్లో ప్రజల ఓటు హక్కులపై ప్రభావం చూపే ప్రయత్నం చేస్తుందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈ 'సర్'పై నా పోరాటం కొనసాగుతుంది. ప్రజల హక్కులను లాక్కోవడానికి ప్రధాని చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటానని" ఆమె స్పష్టంగా చెప్పారు.
అదే సమయంలో, కేంద్ర ప్రభుత్వం తమ ప్రభుత్వాన్ని నియంత్రించడానికి వివిధ మార్గాలు అన్వేషిస్తున్నారని, రాష్ట్రపతి పాలన విధించాలని చూస్తున్నారని ఆమె ఆరోపించారు. అయితే, వీటికి భయపడడం లేదని, బీజేపీ దాడులను ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆమె హామీ ఇచ్చారు. మమతా బెనర్జీ వాదన ప్రకారం, బీజేపీ రాష్ట్రంలోని ప్రజల సర్వసాధారణ హక్కులను నిలిపేయడానికి, ఓట్లు చీల్చేందుకు ద్రోహులు కొందరు బీజేపీ నుంచి డబ్బులు తీసుకుంటున్నారని ఆమె నేరుగా ఆరోపించారు.
మమతా విమర్శలకు బీజేపీ కఠినంగా ప్రతిస్పందించింది. ప్రధానంగా, ప్రధాని మోడీపై మమతా చేసిన ఆరోపణలు స్థిరమైన ఆధారాలు లేకుండా, రాజకీయ ప్రయోజనాల కోసం చేసిన కుట్రలని భాజపా తెలిపింది. రాజ్యాంగం పరంగా ఈ ఆరోపణలు తాము అంగీకరించలేమని, మమతా బెనర్జీ అనర్హురాలుగా వ్యవహరిస్తున్నారని కేంద్రం, రాష్ట్ర పార్టీ నేతలు వాదించారు.
భాజపా నేత శిశిర్ బజోరియా మమతా విమర్శలపై స్పందిస్తూ, ఆమె అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతే, భయం కారణంగా ప్రస్తుత వ్యవస్థను వీలైనంతగా భయపెడుతుందని పేర్కొన్నారు. "మోడీ మైనారిటీలకు వ్యతిరేకి అనే విమర్శలు కేవలం రాజకీయ ఆటలు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోడానికి మమతా సర్కారు ప్రయత్నిస్తోందని నమ్మకం లేదు. ఆమె స్వయంగా ఓటర్ల హక్కులను పరిమితం చేస్తుందనే అంశాలు అధిక exaggeration మాత్రమే" అని ఆయన చెప్పారు.
రాజకీయ విశ్లేషకులు ఈ వ్యవహారాన్ని విభిన్న కోణాల్లో విశ్లేషిస్తున్నారు. మమతా బెనర్జీ, అసెంబ్లీ ఎన్నికల ముందు భాజపాపై విరుచుకు పడటం, తన వైపు ఓటర్ల మనసును దృఢంగా నిలిపే రాజకీయ వ్యూహంగా భావిస్తున్నారు. ఆమె కచ్చితమైన సంకేతం ఇచ్చింది: "భాజపాచే రాష్ట్రంలోని ప్రజల స్వేచ్ఛ, హక్కులు తగ్గించబడుతాయి" అనే అంశాన్ని స్పష్టంగా ప్రజలకు వివరించడం ద్వారా తాను భయంకరమైన రాజకీయ పోరాటానికి సిద్ధమని చూపించింది.
మరొక కోణం ప్రకారం, భాజపా కూడా ఈ విమర్శలను రాజకీయంగా ఎదుర్కొంటుంది. శిశిర్ బజోరియా వ్యాఖ్యల ప్రకారం, మమతా విమర్శలపై భాజపా కఠినంగా ప్రతిస్పందించడం, తన పార్టీపై ప్రజలకు విశ్వాసాన్ని పెంచే ప్రయత్నంగా భావించవచ్చు. రెండు ప్రధాన పార్టీలు ఒకరిని ఒకరు తక్కువ చేసి, ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్రచారాన్ని ప్రారంభించాయి.
ఇక విశ్లేషకులు చెబుతున్నారేమంటే, మమతా సర్కారు కేంద్ర పాలితా విధానాలపై ప్రజలకు అపార అభిప్రాయాన్ని ఏర్పాటు చేయడానికి "సర్" సవరణను ముఖ్యంగా హైలైట్ చేస్తున్నారని. ఇది ప్రత్యేకంగా ఓటరు జాబితా సవరణలపైనా, భాజపా ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాక, తాను హక్కుల రక్షకురాలని చూపించడంలో సహాయపడుతుంది.
రంజాన్ వేడుకల్లో పాల్గొన్న సందర్భంలో మమతా వ్యక్తిగతంగా ప్రజలతో మాట్లాడి, స్థానిక సమస్యలను, వారి ఆందోళనలను వినడం, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం ద్వారా తన రాజకీయ ప్రతిష్టను కూడా పెంచారు. భక్తులు, ప్రజలు, యాత్రికులు ఆమెను వారి మద్దతుదారుగా భావిస్తూ, నేరుగా సమస్యలను పంచుకోవడం రాజకీయ పరంగా ఒక బలమైన సంకేతం.
మొత్తం పరిస్థితిని విశ్లేషిస్తే, మమతా-భాజపా మధ్య ఆత్మీయతా, రాజకీయ పోరాటం, ఓటర్ల హక్కుల అంశాలు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు అన్ని ఒకేసారి కలిసిపోయాయి. "సర్" సవరణ, భాజపా ప్రభావం, ప్రధాని పాత్ర, రాష్ట్రపతి పాలన ఆలోచనలు—all converge election politics కి. మమతా అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్రంలోని ప్రజల నిబద్ధతను తన వైపు గట్టిగా నిలిపే ప్రయత్నాలు చేస్తున్నారు.
ముగింపులో, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రీమియంలో మమతా-భాజపా మధ్య ఘర్షణ మరింత ఉత్కంఠనకరంగా మారుతుంది. మమతా బెనర్జీ తన ఓటరు హక్కులపై పోరాటం కొనసాగిస్తూ, భాజపా ఉనికిని రాష్ట్రంలో అరికట్టే ప్రయత్నంలో మునిగిపోతుంది. భాజపా, ప్రధాని మోడీ పర్యవేక్షణ, మైనారిటీ వ్యతిరేకి ఆరోపణలు, శిశిర్ బజోరియా వ్యాఖ్యలు—all ఈ ఎన్నికలకు పూర్వభావనలో కీలక పాత్ర పోషిస్తాయి.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ సంతోష నవీన్ కుమార్...

**చిన్న శంకరంపేట మార్చి 21 ( ప్రజాస్వరం)**
చిన్న శంకరంపేట మండలం రుద్రారం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే సిసి రోడ్డు పనులను స్థానిక సర్పంచ్ ఆకుల సంతోష నవీన్ కుమార్ ప్రారంభించారు, ఈ సందర్భంగా సర్పంచ్ సంతోష నవీన్ కుమార్, ఉపసర్పంచ్ నర్సింలు తో పాటు గ్రామస్తులు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 10 లక్షల రూపాయలు మంజూరు కావడం జరిగిందని దీంతో సిసి రోడ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు, గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని గ్రామ అభివృద్ధి ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందని వారు అన్నారు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 10 లక్షల రూపాయల నిధులు మంజూరి కోసం కృషి చేసిన మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ కు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంతోష నవీన్ కుమార్, ఉపసర్పంచ్ నర్సింలు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.







## రేంజ్ కార్యాలయంలో ప్రపంచ అటవీ దినోత్సవం

**మనోహరాబాద్ మార్చి 21 (ప్రజాస్వరం)**
మండలం దండుపల్లి వద్ద గల తూప్రాన్ అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో ప్రపంచ అటవీ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. తూప్రాన్ రేంజ్ ఆఫీసర్ అంబర్ సింగ్ ఆధ్వర్యంలో రేంజ్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని అంబర్ సింగ్ సూచించారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా రంజాన్ వేడుకలు......

- **ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లిం సోదరులు**

**చిన్న శంకరంపేట మార్చి 21 ( ప్రజాస్వరం )**

చిన్న శంకరంపేట మండల వ్యాప్తంగా రంజాన్ పండుగ వేడుకలు ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు, చిన్న శంకరంపేట మండలం రుద్రారం గ్రామ శివారులోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులు చిన్న పెద్ద తేడా లేకుండా అందరు కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు, అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు, 30 రోజుల పాటు కటోర ఉపవాస దీక్షలు నిర్వహించి, శుక్రవారం నెలవంక కనబడడంతో నేడు ముస్లిం పెద్దల ఆదేశాల మేరకు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు, మతసామరస్యానికి ప్రతిగా రంజాన్ పండుగను కొలుస్తామని అల్లా దయవల్ల అందరూ బాగుండాలని వారు ప్రార్థనలు చేసినట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# జవహర్ నగర్ లో ఘనంగా రంజాన్ ప్రార్థనలు

**జవహర్ నగర్, మార్చి 21, (ప్రజాస్వరం):**

జవహర్ నగర్ లో శనివారం రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా నిర్వహించారు. బాలాజీ నగర్, అంబేద్కర్ నగర్ ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పండుగ సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈతల వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆశా వర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా..

- **కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**

**సికింద్రాబాద్,మార్చి 21 ( సిద్దిపేట పవర్ ):**

కంటోన్మెంట్ ప్రాంతాల ఆశా వర్కర్లు శనివారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను ఆయన కార్యాలయంలో కలసి తమ సమస్యలను వినతి పత్రం ద్వారా తెలియజేశారు. వారి వినతిని పరిశీలించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కరోనా సమయంలో ఆశా వర్కర్లు చూపిన సేవలు మరువలేనివని, ప్రజలు భయాందోళనలకు గురైన వేళ ముందుండి సేవలందించిన వారి కృషి అమూల్యమని పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అన్యాయాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సరిచేస్తుందని, ఇచ్చిన హామీల మేరకు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తుందని తెలిపారు. ఈ విషయమై తాను వ్యక్తిగతంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహలతో మాట్లాడుతానని చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యాదమ్మ, కృష్ణవేణి, భాగ్యలక్ష్మి, మీనా, సీఐటీయూ నాయకులు మహేందర్, దశరథ్ తదితరులు ఉన్నారు.







# ఘనంగా రంజాన్ వేడుకలు...





- **ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్....**

**మెదక్ మార్చ్ 21 (ప్రజా స్వరం)**

రంజాన్ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం మెదక్ పట్టణం నవాబ్ పేట లోని ఈద్గా వద్ద ఘనంగా ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ ఖాజా మొయినుద్దీన్ ఆధ్వర్యంలో అల్లా సందేశాన్ని అందించారు. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పాల్గొని ఈద్గా అభివృద్ధి కోసం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. ముస్లిం అందరూ ఆనందంగా రంజాన్ పండుగను జరుపుకోవాలని కోరారు. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో భారీ సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.





# అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నా మూడు టాక్టర్ లు ఒక జేసిబి సిజ్ యజమానుల పై కేసులు... ఎసై గంగా రాజు

**తూప్రాన్ మార్చ్ 21 (ప్రజా స్వరం )**

తూప్రాన్ మండల పరిధిలోని కిష్టాపూర్ మరియు గౌడిగూడెం శివార్లలో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం రోజు తూప్రాన్ ఎసై గంగారాజు సిబ్బంది తో దాడులు నిర్వహించారు. ఈ దాడుల లో కిష్టాపూర్ శివార్లలో 2 ట్రాక్టర్లు మరియు గౌడిగూడెం శివార్లలొక్క ట్రాక్టర్,ఒక్క జేసిబి అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ పట్టుబడ్డాయి. అలాగే, ఒక ఇసుక డంపు కూడా గుర్తించ్చి , దానిపై రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చి సీజ్ చేయించామని ఎసై తెలిపారు పట్టుబడిన వాహనాలను తూప్రాన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు ఉంటాయని ప్రజలు ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని ప్రజలను ఎసై కోరారు. కిష్టాపూర్ శివారు లో పట్టుపడ్డ టాక్టర్ యజమాని మన్నే రాము టాక్టర్ డ్రైవర్స్ పిట్ల భాను,పిట్ల సాయికుమార్. గౌడి గూడెం శివారులో పట్టుపడ్డ టాక్టర్ యజమాని అభిషేక్ కుమార్ జేసిబి డ్రైవర్,మరియు ట్రాక్టర్ యజమాని విష్ణువర్ధన్ రెడ్డి ట్రాక్టర్ డ్రైవర్ మన్నే అనిల్ ల పై కేసులు నమోదు చేశామని ఎసై గంగా రాజు తెలిపారు



## కల్దుర్కిలో శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

- **క్వింటాలుకు రూ. 5,875 మద్దతు ధర**
- **ప్రభుత్వ నిబంధనల ప్రకారం విక్రయించాలి : గంగా శంకర్**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 21మార్చి(ప్రజా స్వరం) :**

మార్క్‌ఫెడ్, నాఫెడ్ నేతృత్వంలో బోధన్ మండలం కల్దుర్కి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ శనగ కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. పీసీసీ డెలిగేట్ గంగా శంకర్, బోధన్ ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, వైస్ చైర్మన్ వసంత రెడ్డి, సొసైటీ అధికారులు కలిసి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈఓ శ్రీనివాస చారి మాట్లాడుతూ.. ప్రభుత్వం శనగ క్వింటాలుకు రూ. 5,875 మద్దతు ధర నిర్ణయించిందని, ఎకరానికి 8 క్వింటాళ్ల చొప్పున పంటను కొనుగోలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. పీసీసీ డెలిగేట్ గంగా శంకర్ మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సిబ్బందికి సహకరిస్తూ తమ పంటను విక్రయించుకోవాలని సూచించారు. ఎకరానికి 8 క్వింటాళ్ల నిబంధనను సడలించి, రైతు పండించిన మొత్తం పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా రైతులు నాయకులను, అధికారులను కోరారు. ఈ విన్నపాన్ని ప్రభుత్వం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రకాష్ పటేల్, గణపతి రెడ్డి, గ్రామ సర్పంచ్ నరేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.




## బడ్జెట్‌లో దివ్యాంగులకు రేవంత్ సర్కార్ మొండిచేయి

**బోధన్, నిజామాబాద్ జిల్లా 21మార్చి(ప్రజా స్వరం) :**

రాష్ట్ర బడ్జెట్‌లో దివ్యాంగులకు సరైన స్థానం కల్పించకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు సుజాత సూర్యవంశీ మండిపడ్డారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. ముఖ్యంగా దివ్యాంగుల పెన్షన్ రూ. 4 వేల నుండి రూ. 6 వేలకు, అలాగే వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికుల పెన్షన్ రూ. 2 నుండి రూ. 4 వేలకు పెంచుతామని చెప్పి అసెంబ్లీలో కనీసం ఆ ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. పక్క రాష్ట్రాల్లో దివ్యాంగులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు ఉన్నా, తెలంగాణలో మాత్రం వివక్ష చూపుతున్నారని, ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు కేటాయింపులు మరియు బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ వంటి అంశాలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. మహిళల తరహాలోనే దివ్యాంగులకు కూడా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చకపోతే, వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి చేపడతామని, అవసరమైతే రోడ్ల పైనే నిరాహార దీక్షలకు దిగుతామని ఆమె హెచ్చరించారు.న్నారు.



## ముదిరాజుల సోదరులకు సన్మానం

**సికింద్రాబాద్, మార్చి 21 ( ప్రజా స్వరం ):**



ముదిరాజ్ ప్రగతి భవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉత్తమ ముదిరాజ్ సేవా సంఘ కార్యకర్తలకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా రంగంలో విశేష కృషి చేసిన కార్యకర్తలకు శాలువాలు కప్పి, ఉత్తమ అవార్డులు అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి మాజీ న్యాయ శాఖ మంత్రి పి. చంద్రశేఖర్ ముదిరాజ్, ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ముదిరాజ్, లయన్స్ క్లబ్ చైర్మన్ హనుమంతు రావు ముదిరాజ్, ప్రొఫెసర్ నీలా రాములు ముదిరాజ్ తదితర ప్రముఖులు హాజరై, అవార్డు గ్రహీతలను అభినందించారు. సంఘ పెద్దలు కూడా పాల్గొని, సేవా భావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం సంఘ ఐక్యతను, సేవా స్ఫూర్తిని మరింత బలపరిచేలా నిలిచింది.

# సాలూరలో మిన్నంటిన రంజాన్ సంబరాలు

- **ఈద్గాలో సామూహిక ప్రార్థనలు**
- **సోదరభావానికి ప్రతీకగా వేడుకలు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 21మార్చి(ప్రజా స్వరం) :**

సాలూర మండల కేంద్రంలో శనివారం రంజాన్ (ఈద్‌ఉల్ ఫితర్) వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో జరిగాయి. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు పాటించిన ముస్లిం సోదరులు, స్థానిక ఈద్గా వద్దకు భారీ సంఖ్యలో చేరుకుని ప్రత్యేక సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లాహ్ ఆశీస్సుల కోసం ప్రార్థిస్తూ, ఒకరికొకరు ఈద్ ముబారక్ తెలుపుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. ఈ వేడుకల్లో హిందూ, ముస్లిం సోదరులు కలిసి పాల్గొనడం గమనార్హం. ఒకరి పండుగను మరొకరు గౌరవించుకుంటూ, మిఠాయిలు పంచుకుంటూ సాలూరలో మతసామరస్యం చాటారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్సై స్వయంగా బందోబస్తును పర్యవేక్షిస్తూ, శాంతియుత వాతావరణంలో ప్రార్థనలు ముగిసేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొని ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.







# గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల్లో... ఊహించని ఫలితాలు సాధించాం

- **స్వల్ప తేడాలతో మున్సిపల్ పీఠాన్ని పోగొట్టుకున్నాం**
- **కాంగ్రెస్ అభ్యర్థులకు గజ్వేల్ ప్రజలు అండగా నిలిచారు**
- **బిఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా ఖర్చు పెట్టలేకపోయాం**
- **గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ కు కోటి వేతనం ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం**
- **గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి**

**గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి (ప్రజా స్వరం):**

గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల్లో ఊహించని ఫలితాలు సాధించినట్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వల్ప తేడాలతో మున్సిపల్ పీఠాన్ని కోల్పోగా, బిఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా ఆర్థిక వనరులు సమకూర్చలేక పోయినట్లు చెప్పారు. కష్టపడిన కార్యకర్తలకే ఎన్నికల్లో ప్రాధాన్యత ఇవ్వగా, ఓడిన అభ్యర్థులకు పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. ముఖ్యంగా గజ్వేల్ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలువగా, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలు వర్తింప చేస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరిని గుర్తించుకుంటామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుండగా, మరో 20 ఏళ్ల వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఢోకాలేదని తెలిపారు. ఇప్పటి వరకు రూ కోటికి పైగా వేతనం, ఇతర అలవెన్సులు పొందిన కేసీఆర్ ను ప్రజలు అసహ్యించుకుంటుండగా, అవినీతి, అక్రమాలకు పాల్పడిన బిఆర్ఎస్ పార్టీ నేతలు జైలుకెళ్లడం ఖాయమని వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి రాములు గౌడ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు షరీఫ్, నేతలు సారిక శ్రీనివాస్ రెడ్డి, శివారెడ్డి, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

